క్లుప్తంగా

పర్యావరణాన్ని రక్షిద్దాం



బసాపురం ఎస్ఎస్ ట్యాంకు వద్ద మొక్కలు నాటుతున్న దృశ్యం

ఆదోనిటౌన్ : మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షిద్దామని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తనయుడు, మనోజ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బసాపురం ఎస్ఎస్ ట్యాంకు వద్ద ఐదు ఎకరాల విస్తీర్ణంలో 800 మొక్కలు నాటారు. మనోజ్‌కుమార్‌రెడ్డి, చైర్‌పర్సన్ బోయ శాంత, ఎంపీడీఓ గీతావాణి, కమిషనర్ రఘునాథ రెడ్డి మాట్లాడుతూ జగనన్న పచ్చతోరణం కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ పథకం కింద మొక్కలు నాటామన్నారు. మొక్కల సంరక్షణ బాధ్యతను కేంద్ర ప్రభుత్వం పొదుపు సంఘాల మహిళలకు అప్పగించిందని చెప్పారు. ఎంఈఓ నాగభూషణ్‌రెడ్డి పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోనిరూరల్ : ఆదోని పట్టణానికి చెందిన దివాకర్, పరమానందప్ప ఏపీ39సీవై 7150 నంబర్ గల మోటార్ బైకుపై కర్ణాటక మద్యాన్ని తరలిస్తుండగా అరెస్టు చేసినట్లు ఇస్వీ ఎస్ఐ శ్రీనివాసులు శుక్రవారం విలేకరులకు తెలిపారు. వీరు కర్ణాటక రాష్ట్రం నాగరహాల్ నుంచి మోటార్ సైకిల్‌పై 180 ఎం.ఎల్ పరిమాణం గల 14 ప్యాకెట్లు, 90 ఎం.ఎల్. పరిమాణం గల 8 టెట్రా ప్యాకెట్లను తీసుకొస్తుండగా సంతెకూడ్లూరు బస్టాండు వద్ద అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

పట్టుబడిన మద్యం ధ్వంసం



రోడ్‌రోలర్‌తో ధ్వంసం చేయించేందుకు ఏర్పాటు చేసిన సెబ్ పోలీసులు

ఆదోనిరూరల్ : జిల్లా ఏఈఎస్ రాజశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం వివిధ కేసుల్లో పట్టుబడిన కర్ణాటక మద్యాన్ని రోడ్ రోలర్‌తో ధ్వంసం చేశారు. ఆదోని సెబ్ సీఐ హరికృష్ణ మాట్లాడుతూ ఆదోని సెబ్‌స్టేషన్ పరిధిలో 140 కేసుల్లో పట్టుబడిన 21,731 కర్ణాటక మద్యం ప్యాకెట్లు, 17 కేసుల్లో పట్టుబడిన 169 లీటర్ల నాటు సారాను ధ్వంసం చేయించామని చెప్పారు. సెబ్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంక్ అభివృద్ధికి తోడ్పడాలి

ఆదోనిఅర్బన్ : తీసుకున్న రుణాలను ఖాతాదారులు సకాలంలో చెల్లించి బ్యాంకు అభివృద్ధికి తోడ్పాటునందించాలని ఆదోని శ్రీ మహాయోగి లక్ష్మమ్మవ్వ కో–ఆపరేటివ్ బ్యాంకు బీటీడీ చైర్మన్ రాచోటి రామయ్య, బీఓఎం చైర్మన్ రాచోటి సుబ్బయ్య, సీఈఓ గట్టు మురళీకుమార్ కోరారు. శుక్రవారం సాయంత్రం బ్యాంకులో జనరల్ బాడీ మీటింగ్ బీటీడీ చైర్మన్ రాచోటి రామయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ ఏడాది మార్చి 31 నాటికి బ్యాంకులో డిపాజిట్లు రూ. 248 కోట్లు రాగా, జూలై నాటికి మొత్తం డిపాజిట్లు రూ.257 కోట్లు ఉన్నాయని చెప్పారు. అలాగే జూలై 20 నాటికి రూ.176 కోట్ల రుణాలు ఇచ్చామని, బ్యాంకుకు రూ.1.10 కోట్లు వచ్చిందని చెప్పారు. డైరెక్టర్లు బాద్మి లక్ష్మన్నశెట్టి, దినకరరావు, బి.అశ్వత్థనారాయణ, మాకం సుధాకర్‌బాబు, రాచోటి సుబ్బయ్య పాల్గొన్నారు.

మత స్వేచ్ఛకు భంగం కలిగించొద్దు



మాట్లాడుతున్న పాస్టర్ జాషువా

ఆదోని సెంట్రల్: దేశంలో మత స్వేచ్ఛకు భంగం కలిగించేలా పాలకులు వ్యవహరించరాదని పాస్టర్లు జాషువా, ఎంఎస్.రావు, బెనర్జీరాజు కోరారు. శుక్రవారం పట్టణంలోని రాజశ్రీ హాల్‌లో మణిపూర్‌లో జరుగుతున్న హింసాత్మక దాడులను కండిస్తూ క్రైస్తవుల ఐక్య వేదిక పాస్టర్ల సమావేశం నిర్వహించారు. మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్న చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. అఘాయిత్యాలకు పాల్పడిన వారిని, ప్రార్థనాలయాలను కూల్చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనందరాజు, రెవరెండ్ కోలా విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

వేధింపుల కేసులో భర్తకు జైలు

ఆదోనిరూరల్/పెద్దకడుబూరు : భార్యను వేధించిన కేసులో ఓ వ్యక్తికి ఆదోని కోర్టు 18 నెలలు జైలు శిక్ష, రూ.2 వేలు జరిమానా విధించినట్లు పెద్దకడబూరు ఎస్ఐ మహేష్‌కుమార్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. వివరాలు.. పెద్దకడబూరు మండలం చిన్నకడబూరు గ్రామానికి చెందిన ఎల్.ఈరన్న (38) మండల కేంద్రమైన పెద్దకడబూరు గ్రామానికి చెందిన లక్ష్మిని వివాహం చేసుకొని ఎనిమిది సంవత్సరాలు సజావుగా కాపురం సాగించారు. వీరికి ఇద్దరు కుమారులు. ఆ తరువాత ఈరన్న తాగుడుకు బానిసై రోజూ తాగొచ్చి భార్యను చిత్రహింసలకు గురిచేసేవాడు. వేధింపులు తాళలేక ఆమె 2021 జనవరి 23న పోలీసులకు ఫిర్యాదు చేసింది. నాటి ఎస్ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసి ఈరన్నను రిమాండ్‌కు పంపారు. శుక్రవారం కేసు పూర్వాపరాలను పరిశీలించిన ఆదోని సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వీరవెంకట నాగలక్ష్మి నేరం రుజువు కావడంతో ఏడాదిన్నర జైలు శిక్ష, రూ.2 వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారని ఎస్ఐ వివరించారు.

అర్హులెవరూ సంక్షేమ పథకాలకు దూరంగా మిగిలిపోరాదని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జగనన్న సురక్ష పేరుతో ఇంటికే వచ్చి అవసరమైన 11 రకాల ధ్రువ పత్రాలను అందజేసి ఏ పథకానికి అర్హులో గుర్తించి వాటిని వర్తింపజేసేలా చర్యలు చేపట్టింది. ఇంతకు ముందెన్నడూ ఇలాంటి కార్యక్రమం చేపట్టకపోవడంతో పథకాలు వర్తించక పేదలు మరింత పేదవారిగా మారిపోయారు. దీన్ని గమనించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అధికారులు సచివాలయాల పరిధిలో కార్యక్రమం నిర్వహించి అర్హులకు ధ్రువ పత్రాలు పంపిణీ చేస్తున్నారు.

ప్రజలకు రక్ష..జగనన్న సురక్ష

- 20 రోజుల్లో నియోజకవర్గంలో 47,449 ఇళ్ల సందర్శన
- 53,817 ధ్రువ పత్రాల పంపిణీ



జగనన్న సురక్ష కార్యక్రమంలో ధ్రువ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి (ఫైల్)

ఆదోనిటౌన్: నిజమైన పేదలను పథకాలకు లబ్ధిదారులకు మార్చాలని చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం నియోజకవర్గంలో జోరుగా సాగుతోంది. ప్రజలకు అప్పటికప్పుడే అవసరమైన 11 రకాల ధ్రువ పత్రాలు అందజేసి వారికి పేదరికం నుంచి రక్షించేందుకు చర్యలు చేపట్టింది.వాడవాడలా కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. రూపాయి ఖర్చు లేకుండా ఒకటి, రెండు రోజుల్లోనే ఉచితంగా ధ్రువ పత్రాలను అందజేస్తుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గృహసారథులు, వలంటీర్ల ముఖ్య భూమిక..

సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించడంలో గ్రామ వలంటీర్లు, గృహసారథులు ముఖ్య భూమిక పోషిస్తున్నారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ఎవరికి ధ్రువ పత్రాలు అవసరమో గుర్తిస్తున్నారు. వారి వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేసి టోకెన్ జారీ చేస్తారు. అలాగే పథకాలు అందకపోయి ఉంటే కారణాలు తెలుసుకొని అవసరమైన ధ్రువ పత్రానికి దరఖాస్తు చేయిస్తున్నారు. అధికారులు వాటిని విచారించి నిజమైన అర్హులని తేలితే ఆయా సచివాలయాల పరిధిలో జగనన్న కార్యక్రమం నిర్వహించి ధ్రువ పత్రం అప్పటికప్పుడే అందజేస్తున్నారు. ఇదంతా కేవలం రెండు నుంచి నాలుగు రోజుల్లో పూర్తవుతుంది. ఇక సచివాలయ పరిధిలో ప్రజాప్రతినిధుల అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేసి అవసరమైన వారికి ధ్రువ పత్రాలు ఉచితంగా అందజేస్తున్నారు.

- పట్టణంలో ఈనెల 1 నుంచి కార్యక్రమం ప్రారంభించారు.
- పట్టణంలో 42 , రూరల్‌లో 24 సచివాలయాలు ఉన్నాయి.
- నియోజకవర్గంలో ఆయా సచివాలయాల పరిధిలో వలంటీర్లు 61,060 ఇళ్లను సందర్శించి. 53,093 ధ్రువ పత్రాలను అందజేశారు.
- పట్టణంలో కుల ధ్రువ పత్రాలు 12,392, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు 14,393 ప్రజలకు పంపిణీ చేశారు. మరో 200 దాకా కొత్త రేషన్‌కార్డుల కోసం, పాత రేషన్‌కార్డుల విభజన, ఆధార్ అనుసంధానం, ఆర్వోఆర్, అడంగళ్, మ్యారేజ్ సర్టిఫికెట్లు తదితర పంపిణీ చేశారు.
- ఆదోని మండలంలో 24 గ్రామాల్లో కులం 8,780, ఆదాయ సర్టిఫికెట్లు 8,576, జనన,మరణ 6, ఆధార్‌లింకు, రేషన్‌కార్డు విభజన తదితర సర్టిఫికెట్లు 50 అందజేశారు.

రూపాయి కూడా ఖర్చు కాలేదు



పైసా ఖర్చు కాకుండా ఉచితంగా అవసరమైన సర్టిఫికెట్లను పొందుతున్నాం. గతంలో ఇవే సర్టిఫికెట్ల కోసం తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్వోల చుట్టూ తిరిగి విసిగిపోయాం. చివరికి దళారులను ఆశ్రయించి వారికి అంతోఇంతో ఇచ్చి ధ్రువ పత్రాలు పొందాం. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. జగనన్న ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమం బాగుంది.

– మంగమ్మ, ఇందిరానగర్, ఆదోని

ఉచితంగా సర్టిఫికెట్లు పొందాను



ఉచితంగా కులం, ఆదాయం, రేషన్‌కార్డు విభజన పత్రాలను పొందాను. చాలా సంతోషంగా ఉంది. వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి మా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటికి సంబంధించిన దరఖాస్తులను పూరించి, వార్డుసభలో పిలిచి సర్టిఫికెట్లను ఉచితంగా పంపిణీ చేశారు. గతంలో ఎవరూ ఇలా చేయలేదు. మాకు ఇబ్బందులు తప్పాయి.

– సుజాత, మహాయోగిలక్ష్మమ్మవ్వ నగర్, ఆదోని

మొక్కలను సంరక్షిద్దాం

కోసిగి: ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ కుమారి అయ్యమ్మ కోరారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఈఓ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పాఠశాలలకు మొక్కలు పంపిణీ చేశారు.ఆమె ఆమట్లాడుతూ బనవాసి నర్సరీ నుంచి మొక్కలు వచ్చినట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు మాణిక్యరాజు, నాడుగేని నాగరాజు, రాజేష్ పాల్గొన్నారు.

కుట్టుమిషన్ల పంపిణీ

ఆదోనిఅర్బన్ : బ్యాంక్ ఆఫ్ బరోడా ఆదోని శాఖ ఫౌండేషన్ డే సందర్భంగా శుక్రవారం మూడు కుట్టు మిషన్లను ఫెయిత్‌హోం ట్రస్టీకి అందజేశారని ఫెయిత్‌హోమ్ ట్రస్టీ సభ్యులు డాయిల్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. నిరుద్యోగుల యువత జీవనోపాధి శిక్షణ కోసం బ్యాంక్‌ఆఫ్ బరోడా మేనేజర్ శివకృష్ణ, బ్యాంకు బృందం మిషన్లు ఇచ్చారని చెప్పారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మంత్రాలయం: కురుస్తున్న వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వేణుగోపాల్‌రాజు సూచించారు. శుక్రవారం మండలంలోని చెట్నేహళ్లి గ్రామంలో స్థానికులతో సమావేశం నిర్వహించారు. త్వరలో జరగబోయే మొహర్రంను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని, ఎలాంటి అల్లర్లకు పాల్పడవద్దని హెచ్చరించారు. తుఫాన్ కారణంగా వర్షాలు కురుస్తున్న సమయంలో విద్యుత్ స్తంభాలను తాకరాదని, ఉరుములు,మెరుపుల సమయంలో సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని, చెట్ల కింద, పొలాల్లో ఉండరాదని సూచించారు. బాల్య వివాహాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి వ్యక్తి గత సమాచారం అడిగితే చెప్పరాదని వివరించారు.

ఆర్థిక సాయం



బాధితుడి కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సాయి

ఆదోనిటౌన్ : పట్టణంలోని 36వ వార్డు టీజీఎల్ కాలనీలో నివాసముంటున్న కె.వెంకటేశ్వర్లు ఆరు నెలలుగా బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతున్నాడు. మెరుగైన వైద్యం చేయించుకునేందుకు ఆర్థిక స్తోమత లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని కౌన్సిలర్ సందీప్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఆయన తనయుడు మనోజ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. పార్టీలో చురుకుగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లుకు మెరుగైన వైద్యం చేయించాలని సూచించారు. దీంతో కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందగా రూ.3.65 లక్షలు ఖర్చయ్యిందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే శుక్రవారం తన నివాసంలో రూ.3లక్షల చెక్కులను బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

మంత్రాలయం: మండలంలోని రచ్చుమర్రి గ్రామానికి చెందిన సంగటి ఈరన్న శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డికి తెలియడంతో సొంతంగా రూ.10 వేలు అందజేశారు. ఈమేరకు ఆ మొత్తాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు బొజ్జప్ప,రవిరెడ్డి, రోగప్ప శుక్రవారం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ఆ మొత్తాన్ని అందజేశారు.మాజీ వైస్ ఎంపీపీ వెంకోబా, ఈరన్నగౌడ్, మేకలనారయణ, రాము,కర్రెన్న, రాజు,మోహన్, సోమేష్ ఉన్నారు.

మూతపడిన సచివాలయం

కోసిగి: స్థానిక సచివాలయం –5 కార్యాలయం ఉద్యోగులు లేక శుక్రవారం మూత పడింది. కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగస్తులు అందరు బదిలీ అయ్యారు. అయితే ఇప్పటి వరకు ఇక్కడికి ఒక్కరినీ నియిమించ లేదు. కార్యాలయంలో పనిచేసే పంచాయతీ కార్యదర్శి మెటర్నిటీ సెలవులో వెళ్లింది. మిగిలిన డిజిటల్ అసిస్టెంట్, వీఆర్వో, వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీసు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు బదిలీ అయ్యారు. ఒక్క సర్వేయర్ మాత్రమే ఉన్నారు. ఆయన కూడా ఫీల్డ్‌కు వెళ్లడంతో కార్యాలయం తెరుచుకోలేదు.

దరఖాస్తు చేసుకోండి

ఆదోని సెంట్రల్: సార్వత్రిక విద్యాపీఠం (డిస్టెన్స్ ఎడ్యుకేషన్)లో చేరదలిచిన వారు దరఖాస్తు చేసుకోవాలని కేంద్రం సార్వత్రిక విద్యాపీఠం కోఆర్డినేటర్ మల్లికార్జున తెలిపారు. శుక్రవారం స్థానిక పురపాలక ఉన్నత పాఠశాలలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి సెప్టెంబర్ 5వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు చేయదలిచిన వారు విద్యార్థతకు సంబంధించిన టీసీ, అధార్ కార్డు, రేషన్ కార్డు, కుల, ఆదాయ సర్టిఫికెట్లు, పాస్‌ఫొటోలతో సంప్రదించాలని కోరారు. సహాయ కో ఆర్డినేటర్ ఫయాజుద్దీన్ పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు కల్పించాలి

ఆదోనిరూరల్ : జిల్లాలో కొత్తగా పరిశ్రమలు స్థాపించి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, నాయకులు తిప్పన్న, వీరేష్, నాగరాజు, వెంకటేష్ కోరారు. ఈనెల 26 నుంచి 31వ తేదీ వరకు ఆదోని నుంచి కర్నూలు వరకు జరిగే మహాపాదయాత్రను జయప్రదం చేయాలని శుక్రవారం పట్టణంలోని ఖాజీపుర, బోయగేరి, మరాటీగేరి, వడ్డేగేరి ఏరియాల్లో పాదయాత్ర చేశారు.

పైపులైన్ పనుల పరిశీలన

ఆదోనిటౌన్ : పట్టణంలోని కల్లుబావి, వైఎస్సార్ నగర్ ప్రాంతాల్లో జరుగుతున్న ఇంటర్నల్ పైపులైన్ పనులను మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి ఆయా ప్రాంతాలకు తాగునీటిని సరఫరా చేయాలని వాటర్‌వర్క్స్ అధికారులను ఆదేశించారు. వైఎస్సార్‌నగర్‌లో ఖాళీ స్థలాలను గుర్తించారు. వాటికి కంచె ఏర్పాటు చేసి మొక్కలను నాటి తీర్చిదిద్దుతామని చెప్పారు.

బస్సు సౌకర్యం కల్పించండి

ఆదోని సెంట్రల్: మండలంలోని జి.హొసల్లి నుంచి బదినేహాల్ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు భరత్‌కుమార్, శ్రీనివాసులు కోరారు. శుక్రవారం ఆర్టీసీ డిపో మేనేజర్ రఫీక్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ జి. హొసల్లి నుంచి విద్యార్థులు బదినేహాల్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వంద మంది దాక వెళ్తున్నారని చెప్పారు. వేళకు బస్సు సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. గణేష్, నాగరాజు, పవన్,గౌస్,రాజు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్ తనిఖీ

హొళగుంద: మండల కేంద్రంలో శుక్రవారం హౌస్ టు హౌస్ సర్వేలో భాగంగా తహసీల్దారు హుసేన్‌సాహెబ్ పోలింగ్ బూత్ 45ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బీఎల్ఓలకు పలు సూచనలు ఇచ్చారు. ఓటరు జాబితాలో తప్పొప్పులు ఉంటే సరి చేసుకోవాలన్నారు. ఓటు హక్కు, గుర్తింపు కార్డులో చేర్పులు, మార్పులు, పేర్లు నమోదు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని బీఎల్ఓలను హెచ్చరించారు. ఆయనతో పాటు ఆర్ఐ దినోజ్, వీఆర్ఓ విజయలక్ష్మి ఉన్నారు.

వీఆర్ఏలను ఆదుకోవాలి

చిప్పగిరి: చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్న వీఆర్ఏలను ప్రభుత్వం ఆదుకోవాలని ఆ సంఘం నాయకులు కోరారు. వీఆర్ఏల సమస్యల పరిష్కారానికి రెండు రోజుల పాటు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. మండలంలోని వీఆర్ఏలు శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం సమీపంలో రెండో రోజుగా నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నామినీగా పని చేస్తున్న వీఆర్ఏలను రెగ్యులర్ చేయాలని, రికవరీ చేసిన టీఏ, డీఏలను వెనక్కి ఇస్తూ డీఏ తో కూడిన వేతనం ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మండలంలోని వీఆర్ఏలు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



ముఖ్యమంత్రి చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న చేనేత కార్మికులు

ఆదోని సెంట్రల్: ఆర్థికంగా చితికి పోయిన చేనేత జీవితాలకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతన్న నేస్తం కింద ఆర్థిక సాయం అందజేయడం హర్షనీయమని లబ్ధిదారులు భాస్కర్, చంద్రశేఖర్, శీను, నాగరాజు, యల్లప్ప తెలిపారు. శుక్రవారం సీఎం వైఎస్ జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ ఆదోనిలో గత ఏడాది 280 మందికి గాను నేతన్న నేస్తం కింద రూ.24,వేల చొప్పున రూ.67,20 లక్షలు వచ్చిందన్నారు. ఈ సంవత్సరం 17 మందికి అదనంగా మొత్తం 297 మందికి జగనన్న నేస్తం కింద దాదాపు రూ 71.28 లక్షలు అందజేయనుండటం అభినందనీయమన్నారు. మా జీవితాల్లో వెలుగులు నింపుతున్న ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

వైఎంకే పాఠశాలలో డిగ్రీ కళాశాల ఏర్పాటు

ఆదోని సెంట్రల్: ఆదోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను వైఎంకే పాఠశాలలో తరగతులను నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శివారెడ్డి తెలిపారు. శుక్రవారం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి సహకారంతో వైఎంకే పాఠశాల భవనం మ్యాపింగ్ చేసి ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపినట్లు చెప్పా. న్యూ ఎడ్యుకేషన్ సిస్టం ప్రకారం కొత్తగా కళాశాలలను ఏర్పాటు చేసేటప్పుడు సింగల్ లేదా మూడు కోర్సులను మాత్రమే ప్రవేశ పెడుతారన్నారు. హెల్ప్‌డెస్క్ ద్వారా ఆన్‌లైన్‌లో ఇప్పటి వరకు 60 మందిని అడ్మిషన్ రిజిస్టర్ చేయించామన్నారు. పత్తికొండ, ఎమ్మిగనూర్ డిగ్రీ కళాశాలల నుంచి ఇక్కడికి ఫ్యాకల్టీని నియమిస్తారన్నారు. వచ్చే ఏడాది మరిన్ని కోర్సులు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. కళాశాలలో బీఏ ఎకానిమిక్స్, బీకాం జనరల్ మేజర్, బీఎస్‌సీలో బీజెడ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న మంత్రి జయరాం

ఆలూరు: సీజనల్ వ్యాధులపై గ్రామాల్లోని ప్రజలను అప్రమత్తం చేయాలని మంత్రి గుమ్మనూరు జయరాం వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నియోజకవర్గంలోని పలు గ్రామాల ప్రజలు తమ గ్రామాల్లో వైద్యులు అందుబాటులో ఉండడం లేదని మంత్రి దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఆరు మండలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే గ్రామాల్లోని పంచాయతీ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎప్పటికప్పుడు పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

చిన్న సినిమాలను ఆదరించాలి



ఇన్‌ఫార్మర్ చిత్రం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్, చిత్ర యూనిట్

ఎమ్మిగనూరుటౌన్: సందేశాత్మకంగా నిర్మించే చిన్న సినిమాలను ప్రేక్షలు ఆదరించాలనే అప్పుడే సినీరంగంలో యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు పేర్కొన్నారు. ఎమ్మిగనూరుకు చెందిన వినోద్‌రెడ్డి, చాందినీ హీరో హీరోయిన్లుగాను స్థానికులైన డైరెక్టర్ వసంత్‌కుమార్, నిర్మాతలు ఉమాదేవి, అగ్రహారం నాగిరెడ్డి ఆధ్వర్యంలో నిర్మించిన ఇన్‌ఫార్మర్ చిత్రం పోస్టర్‌తో పాటు ట్రైలర్‌ను శుక్రవారం ప్రముఖ సినీ నిర్మాతలు రూపా జగదీష్, సంజీవరెడ్డి, సినీ తారాగణంతో కలిసి చైర్మన్ ఆవిష్కరించారు. ప్రేమతో పాటు క్రైం తదితర అంశాలతో సందేశాత్మకంగా నిర్మించిన ఈ సినిమాను ఆదివారం విడుదల చేయనున్నట్లు నిర్మాతలు తెలిపారు.

మెదడు వ్యాధులతో వైకల్యం, మరణాలు

కర్నూలు(హాస్పిటల్): ప్రపంచంలో అత్యంత ఖరీదైన వ్యాధుల్లో మెదడుకు వచ్చే రుగ్మతలు అని, తద్వారా అధిక శాతం అంగవైకల్యం చెందడం, మరణాలు సంభవిస్తున్నాయని న్యూరోఫిజీషియన్ డాక్టర్ నాగసురేష్ చెప్పారు. వరల్డ్ బ్రెయిన్ డే సందర్భంగా శుక్రవారం స్థానిక మెడికవర్ హాస్పిటల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగసురేష్ మాట్లాడుతూ భారత దేశంలో వివిధ నాన్ కమ్యూనికబుల్ న్యూరోలాజికల్ డిజార్డర్స్‌లో స్ట్రోక్ 37.9 శాతం, మైగ్రేన్ తలనొప్పి 17.5శాతం, మూర్ఛ 11.3 శాతం ఉందన్నారు. మానసిక, సామాజిక, శారీరక శ్రేయస్సు కోసం మెదడు ఆరోగ్య అవగాహన అవసరమన్నారు. తద్వారా వైకల్యాన్ని తగ్గించడంలో ఉపయోగపడుతుందన్నారు.

గ్రామాల్లో సీపీఎం జీపుజాతా

ఆదోనిరూరల్ : మండలంలోని దిబ్బనకల్, సలకలకొండ, బసరకోడు, హువ్వనూరు, విరుపాపురం, సదాపురం, గోనబావి, నెట్టేకల్, సాంబగల్, చిన్నపెండేకల్, పెద్దపెండేకల్, ఆరేకల్ గ్రామాల్లో శుక్రవారం సీపీఎం నాయకులు జీపుజాతా చేపట్టారు. మండల కార్యదర్శి కె.లింగన్న, మండల కార్యదర్శి వర్గ సభ్యులు బి.వీరారెడ్డి, మండలక మిటీ సభ్యుడు రామాంజనేయులు మాట్లాడుతూ ఈనెల 26 నుంచి 31వ తేదీ వరకు చేపట్టే మహాపాదయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మునిస్వామి, చిరంజీవి, భీమాంజనేయులు, బసరకోడు మునిస్వామి, నాగరాజు పాల్గొన్నారు.

గుంటూరుకు వచ్చి పింఛన్ ఇచ్చారు..

సాక్షి సాధనం



గుంటూరులో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ వీరేష్

ఈ ఫొటోలో దివ్యాంగ పింఛన్ కోసం వేలి ముద్ర వేస్తున్న మహిళ పేరు బోయ ఉరుకుందమ్మ. కందుకూరు గ్రామానికి చెందిన హనుమప్ప, నరసమ్మ దంపతులకు కుమార్తె. ఆమె ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలలో గ్రామంలో పనులు లేకపోవడంతో బతుకుదెరువు కోసం గుంటూరుకు వలస వెళ్లారు. రెండు నెలల పాటు అక్కడే మిరప పొలాల్లో పనులు చేసుకున్నారు. విషయం తెలుసుకున్న గ్రామ వలంటీర్ వీరేష్ అక్కడికి వెళ్లి వారికి పింఛన్ అందజేశాడు. ఇలా రెండు నెలలు ఆమెకు అక్కడికే వెళ్లి పింఛన్ అందజేయడంపై కుటుంబ సభ్యులు అభినందించారు.

– కోసిగి

ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించాడు



అసలే గ్రామంలో పనులు లేని సమయం కావడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో కలిసి గుంటూరులో మిరప కోతల పనులకు వెళ్లాం. అక్కడ వచ్చే కొద్దిపాటి కూలితో ఇబ్బందులు పడుతున్నాం. ఈ సమయంలో మా గ్రామ వలంటీర్ వీరేష్ ఇక్కడి వచ్చి నాకు ప్రభుత్వం అందజేసే పింఛన్ సొమ్ము ఇచ్చాడు. ఆయన ఇచ్చిన సొమ్ముతో ఆ సమయంలో మాకు ఆర్థిక ఇబ్బందులు తప్పాయి. రెండు నెలలు తీసుకోకపోతే పింఛన్ పోతుందని మాకు తెలియదు. ఇది తెలిసి ఆయన మాకు ఇక్కడికే వచ్చి పింఛన్ సొమ్ములు అందజేశాడు.

– ఉరుకుందమ్మ, కందుకూరు

ఇంటింటా ఓటరు సర్వే ప్రారంభం



సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్



ఇంటింటి సర్వే చేపట్టిన బీఎల్ఓలు

మంత్రాలయం: ఎన్నికల సంఘం, ఉన్నాతాధికారుల ఆదేశాల మేరకు మంత్రాలయంలో ఓటరు జాబితాపై ఇంటింటి సర్వేను తహసీల్దార్ చంద్రశేఖర్, సర్పంచ్ తెల్లబండ్లభీమయ్య నేతృత్వంలో శుక్రవారం ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలు తమ కుటుంబ సభ్యుల వివరాలను ఓటరు జాబితాలో ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని, లేకపోతే కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో బీఎల్‌వోల సర్వే చేస్తున్నారని, ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని కోరారు.

ఓటర్ల జాబితా పరిశీలన

కౌతాళం: మండలంలో ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా బీఎల్ఓల ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే చేపడుతున్నట్లు తహసీల్దార్ రామేశ్వర రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జాబితాలోని తప్పులను సరిచేసి కొత్త జాబితాను సిద్ధం చేయాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 21 నుంచి ఆగస్టు 20వ తేదీ వరకు సవరణ కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ఇందులో బీఎల్ఓలు ప్రతి ఇంటింటికీ వెళ్లి వాస్తవాలను పరిశీలించి సవరణలు ఉంటే ఇంటి యజమాని ప్రమేయంతో చేస్తారన్నారు. అలాగే మరణ, వివాహమై వేరే ప్రదేశంలో ఉన్న వారిని జాబితాను తొలగిస్తామన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతను నూతన ఓటర్లుగా నమోదు చేస్తామని వివరించారు.

చర్యలు తీసుకోండి



డీఎస్పీ శివనారాయణస్వామికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

ఆదోనిఅర్బన్ : గోవులను కబేళాకు అమ్మిన వారిపై చర్యలు తీసుకోవాలని వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు డీఎస్పీ శివనారాయణస్వామిని, సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ అక్రమంగా గోవులను అమ్మిన పూజారి ఓబులేష్, శ్రీనివాసులు వారి సోదరులపై పెద్దతుంబళం పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ చేయించామన్నారు. సభ్యులు మనోహరయ్య, ప్రతాప్‌స్వామి, శ్రీనివాసులు, అడివేష్, మాజీ సర్పంచ్ రాముడు, విరుపాక్షి, హాన్వాల్ సిద్ధలింగప్ప, పరమేష్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఆదర్శపాలన



పెద్దకడబూరులో ధ్రువ పత్రాలను అందజేస్తున్న నాయకులు, అధికారులు

పెద్దకడబూరు : రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. పెద్దకడబూరు సచివాలయం – 2లో సర్పంచ్ రామాంజనేయులు అధ్యక్షతన శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజల ముంగిటకే పారదర్శక పాలన అందిస్తున్నారని కొనియాడారు. అనంతరం 378 మందికి ధ్రువ పత్రాలను అందజేశారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఆర్ఐ మహేష్, ఉప సర్పంచ్ విజయేంద్రరెడ్డి, కోసిగి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ముక్కరన్న, నాయకులు రవిచంద్రరెడ్డి, శివరామిరెడ్డి, అర్లప్ప పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): ఆపదలో ప్రాణాలు నిలిపే సీపీఆర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ విజయానందబాబు చెప్పారు. చిన్నపిల్లల విభాగం, ఐఏపీ ఆధ్వర్యంలో శుక్రవారం నేషనల్ సీపీఆర్ డే సందర్భంగా స్థానిక గుత్తిరోడ్డులోని మాంటి ఇంటర్నేషనల్ స్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయానందబాబు మాట్లాడుతూ కోవిడ్ అనంతరం ఇటీవల గుండెపోటు మరణాలు పెరిగాయని, అకస్మాత్తుగా చాలా మంది గుండెపోటుతో కుప్పకూలుతున్న సంఘటనలు చూస్తున్నామని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో మరణాలు తగ్గించేందుకు సీపీఆర్ ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. గుండెపోటుకు గురైన వ్యక్తికి వెంటనే సీపీఆర్ చేస్తే ప్రాణాలు కాపాడవచ్చని అన్నారు. ఈ మేరకు ప్రతి ఒక్కరూ సీపీఆర్‌పై శిక్షణ పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఐఏపీ కార్యదర్శి డాక్టర్ వీరరత్నాకర్‌రెడ్డి, చిన్నపిల్లల విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ కృష్ణ, ప్రకాష్ ఆనంద్, నియోనెటాలజిస్టు డాక్టర్ భరత్‌రెడ్డి పాల్గొన్నారు.